

సాహిత్యంలో 'అరుణ'కిరణం
ఇంద్రవెల్లి జెడ్పీ స్కూల్ ఉపాధ్యాయురాలు బుట్టేవార్ అరుణ 1,937 కవితలు రాసి 10 సాహిత్య పుస్తకాలు ప్రచురించారు. బాలల్లో సాహిత్య ఆసక్తిని పెంపొందిస్తున్నారు. 8లో▸



నిర్మల్‌లో సైలెన్సర్ల మోత
నిర్మల్‌లో కొందరు యువకులు అధిక శబ్దాలు చేసే సైలెన్సర్లను బైక్‌లకు బిగించుకుంటున్నారు. వీటి చప్పుడు భరించలేక జనం అసహనానికి గురవుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /26.0

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఏసీబీకి చిక్కిన సర్వేయర్


సర్వేయర్ ఉమాజీ

కడెం: కడెం మండల సర్వేయర్ పవార్ ఉమాజీ ఏసీబీకి చిక్కాడు. మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన గుగ్లవత్ ప్రభాకర్ తన తండ్రి మరణించగా అతని పేరిట ఉన్న ఐదెకరాల పట్టా మార్పిడికి దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకు సర్వేయర్ ఉమాజీ ఎకరాకు రూ.ఐదు వేల చొప్పున రూ.25వేలు డిమాండ్ చేశాడు. ఒప్పందం మేరకు ప్రభాకర్ ఈనెల 20న రూ.12వేలు ముట్టజెప్పాడు. మిగతా డబ్బులు ఇస్తేనే పని పూర్తవుతుందని సర్వేయర్ తెలుపగా, బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో రూ.7వేలు ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ విజయకుమార్ సర్వేయర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కాగా, గతేడాది జనవరిలో లంచం తీసుకుంటూ తహసీల్దార్ రాజేశ్వరి, డీటీ చిన్నయ్య ఏసీబీకి పట్టుబడిన విషయం మరువక ముందే మరొక రెవెన్యూ అధికారి ఏసీబీకి చిక్కడం గమనార్హం.

ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలం


వేలం నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ రజాక్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం వివిధ కారణాలతో సీజ్ చేసిన 17 వాహనాలకు జిల్లా సూపరింటెండెంట్ ఎండీ రజాక్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. వాహనాల విలువ రూ.88,500గా నిర్ణయించగా.. రూ.1,32,224 ఆదాయం వచ్చింది. ఈ మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తామని సూపరింటెండెంట్ రజాక్ తెలిపారు. ఎక్సైజ్ సీఐ రంగస్వామి, ఎస్సైలు వసంతరావు, అభిషేకర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌టౌన్: రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ అకాడమీలు, స్పోర్ట్స్ హాస్టళ్లలో ప్రవేశాలు కల్పించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 10–12 ఏళ్లవారు జిమ్నాస్టిక్, స్విమ్మింగ్, 12–16 ఏళ్లవారు అథ్లెటిక్స్, సైక్లింగ్, హ్యాండ్‌బాల్, హాకీ, వాలీబాల్ తదితర క్రీడల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. క్రీడా ధ్రువీకరణ పత్రాలు, స్టడీ సర్టిఫికెట్లు, రెసిడెన్షియల్, ఆధార్‌కార్డ్, 10 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఉదయం 7గంటలకు వెళ్లాలని సూచించారు. జూన్ 1న సిద్దిపేట జిల్లాలోని వాలీబాల్ అకాడమీకి, 10, 11తేదీల్లో హైదరాబాద్‌లోని ఓయూ క్యాంపస్‌లో సైక్లింగ్–ఫ్రేస్లింగ్‌కు, 10, 11 తేదీల్లో హన్మకొండలోని క్రీడావసతి గృహంలో అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్, హ్యాండ్‌బాల్ పోటీలకు, 10న హైదరాబాద్‌లోని సరూర్ నగర్ స్టేడియంలో, సిరిసిల్లలోని వాలీబాల్ అకాడమీలో వాలీబాల్ ప్రవేశ ఎంపిక పోటీలకు హాజరు కావాలని తెలిపారు. 12న వనపర్తిలోని బాలకృష్ణయ్య మినీస్టేడియంలో హాకీ పోటీలు, 12న ఖమ్మంలోని అథ్లెటిక్స్ అకాడమీలో, 13న మహబూబ్‌నగర్‌లోని మెయిన్ స్టేడియంలో వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జీపీవో పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలో ఈ నెల 25న నిర్వహించనున్న గ్రామపాలన అధికారుల నియామక పరీక్షకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఉదయం 9గంటలలోపు చాణక్య హైస్కూల్ (రెడ్డి ఫంక్షన్‌హాల్ సమీపంలో) లో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రానికి చేరుకోవాలని పేర్కొన్నారు. హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

నిర్మల్ రూరల్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థుల హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ ముడారపు పరమేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 3నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు ఇవ్వాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని సోమవారపేట్ ఉన్నతపాఠశాలలో పరీక్షాకేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

సర్వేయర్లొస్తున్నారు!

- ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ
- ఈనెల 17న ముగిసిన గడువు
- 26న ధ్రువపత్రాల పరిశీలన
- ఎంపికైనవారికి 50 రోజుల శిక్షణ
- త్వరలో అందుబాటులోకి సేవలు



శిక్షణ ఫీజుల వివరాలు

రిజర్వేషన్ కేటగిరి	ఫీజు
ఓసీ అభ్యర్థులు	రూ.10వేలు
బీసీ అభ్యర్థులు	రూ.5వేలు
ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు	రూ.2,500

జిల్లా వివరాలు

జిల్లాలోని మండలాలు	19
రెగ్యులర్ సర్వేయర్లు	12
ఐకేపీ సర్వేయర్లు	5
భూముల సర్వే నంబర్లు	1,67,046
భూ విస్తీర్ణం	8,96,523.11 ఎకరాలు

నిర్మల్‌చైన్‌గేట్: భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, లావాదేవీలు మరింత పారదర్శకంగా జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం నూతన విధానాలను అమలు చేస్తోంది. రిజిస్ట్రేషన్ల సమయంలోనే భూమి కొలతలు, హద్దులు తదితర వివరాలతో కూడిన మ్యాప్ (స్కెచ్) కూడా రైతులకు అందించాలని నిర్ణయించింది. అయితే ఇందుకు అవసరమైన సర్వేయర్ల కొరతను అధిగమించడానికి చర్యలు తీసుకుంటోంది. అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా ఎంపిక చేసి వారికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే పక్షం రోజుల క్రితమే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించి ప్రక్రియ పూర్తి చేసింది. సివిల్ సబ్జెక్ట్‌తో ఇంజినీరింగ్, డిప్లొమా విద్యార్హత ఉన్న వారు ఈనెల 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 26వ తేదీన అధికారులు వారి ధ్రువపత్రాలు పరిశీలించనున్నారు. ఎంపిక ప్రక్రియ కూడా పూర్తయితే త్వరలోనే వారి సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశముంది. భూముల లావాదేవీలు మరింత సమర్థవంతంగా, శాస్త్రీయంగా జరిగేందుకు ఈ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందని సర్కారు భావిస్తోంది. ఈ విధానాన్ని త్వరలోనే అమలులోకి తీసుకురావడానికి కార్యాచరణ ప్రారంభించింది.

ఎంపికైనవారికి 50 రోజుల శిక్షణ
లైసెన్స్‌డ్ సర్వేయర్ శిక్షణకు నిరుద్యోగులు చేసిన దరఖాస్తులు పరిశీలించాక అధికారులు అర్హులను ఎంపిక చేస్తారు. ఈ నెలాఖరు నుంచే 50రోజుల పాటు వారికి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, నిజాం పాలనలో మాత్రమే సెత్వార్ పేరిట సర్వే నిర్వహించారు. ఆ సమయంలో రెవెన్యూ గ్రామాలవారీగా పట్టాదారుల సమాచారంతో ఖాస్రా పహాణీ తయారు చేసి అందుబాటులో ఉంచారు. అప్పటినుంచి రెవెన్యూశాఖ దానినే ప్రామాణికంగా పరిగణిస్తూ వస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖాస్రా పహాణీ ఆధారంగా భూ దస్త్రాల ప్రక్షాళన చేపట్టింది. భూమి హద్దులను గుర్తించేలా సర్వే చేయకపోవడంతో వివాదాలు అలాగే కొనసాగుతున్నాయి. వీటి శాశ్వత పరిష్కారానికే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

26న సర్టిఫికెట్ల పరిశీలన



లైసెన్స్‌డ్ సర్వేయర్ శిక్షణ కోసం జిల్లా వ్యాప్తంగా 212 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 26న ఉంటుంది. అనంతరం ఎంపికైన వారికి దాదాపు 50రోజుల పాటు రెండు దశల్లో స్థానిక పెన్షనర్ సంఘ భవనంలో ఉదయం థియరీ మధ్యాహ్నం ప్రాక్టికల్ క్లాసులు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. – రాథోడ్ సుదర్శన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ, నిర్మల్

సర్వే మ్యాప్‌లతో రిజిస్ట్రేషన్లు
లైసెన్స్‌డ్ సర్వేయర్ల విధానాన్ని అమలు చేయడం ద్వారా భవిష్యత్‌లో భూములకు సంబంధించిన వివాదాలు తగ్గుముఖం పట్టే అవకాశముందని సర్కారు భావిస్తోంది. ఎందుకంటే ప్రస్తుతం రైతుల పేర్లు, సర్వే నంబర్, విస్తీర్ణం లాంటి వివరాలతో మాత్రమే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఆ భూమికి సంబంధించిన మ్యాప్ ఉండదు. కానీ.. లైసెన్స్‌డ్ సర్వేయర్లు అందుబాటులోకి వస్తే రిజిస్ట్రేషన్ కంటే ముందే భూమికి సంబంధించిన మ్యాప్ (స్కెచ్) తయారు చేస్తారు. దానిని సంబంధిత పోర్టల్ అప్‌లోడ్ చేస్తారు. ఆ తర్వాత ప్రభుత్వ సర్వేయర్లు వాటిని పరిశీలించి అన్నీ సక్రమంగా ఉంటేనే ఆమోదిస్తారు. ఈ మ్యాప్‌లోనే అన్ని వివరాలుంటాయి. దీంతో ఇప్పుడున్న దానికంటే శాస్త్రీయమైన పద్ధతిలో రిజిస్ట్రేషన్లు జరిగే అవకాశం ఉంటుంది. భూ భారతితో పాటు సర్వే మ్యాప్స్ రూపకల్పన కూడా ఒకే సమయంలో అందుబాటులోకి తీసుకురావాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది.

ఫస్ట్‌రోజే పాఠ్యపుస్తకాలు

- యూనిఫాంలూ అందించాలని నిర్ణయం
- ఇప్పటికే ఎమ్మార్సీలకు చేరిన టెక్స్ట్‌బుక్స్
- జూన్ 6 నుంచి 19 వరకు బడిబాట
- ముగింపురోజు విద్యార్థులకు క్రీడాపోటీలు


గోదాంకు చేరిన పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న అధికారులు

ఈ నెల 23 వరకు జిల్లా సమాచారం

ప్రాథమిక పాఠశాలలు	577
ప్రాథమికోన్నత పాఠశాలలు	89
ఉన్నత పాఠశాలలు	164
కేజీబీవీలు	18
మొత్తం పాఠశాలలు	848
మొత్తం విద్యార్థులు	71,390
అవసరమైన పార్ట్–1 పుస్తకాలు	3,40,220
ఇప్పటివరకు వచ్చినవి	3,06,740
ఇంకా రావాల్సినవి	33,480

లక్ష్మణచాంద: పాఠశాలల పునఃప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే జిల్లాకు 90 శాతం పుస్తకాలను అన్ని మండలాల ఎమ్మార్సీలకు సరఫరా చేసింది. జిల్లాకు పార్ట్–1 పాఠ్య పుస్తకాలు 3,40,220 అవసరముండగా ఇప్పటికే 3,06,740 వచ్చాయి. ఇంకా 33,480 పుస్తకాలు పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి వస్తాయని అధికారులు చెబుతున్నారు. పార్ట్–2 పుస్తకాలు సెప్టెంబర్‌లో వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. 6–10 విద్యార్థులకూ పాఠ్యపుస్తకాలతోపాటు నోట్‌బుక్స్ అందజేయనున్నారు. 1–5 తరగతుల విద్యార్థులకు ఇంకా నోట్‌బుక్స్ రాలేదని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ వస్తే వెంటనే అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బడిబాట షెడ్యూల్ ఇలా..
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఏటా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జూన్ 6న స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులను భాగస్వాములను చేస్తూ పెద్ద ఎత్తున గ్రామసభ నిర్వహించాలి. 7న ఉపాధ్యాయులు ప్రతీ ఇంటికి వెళ్లి బడీడు పిల్లలను గుర్తించాలి. 8, 9, 10 తేదీల్లో కరపత్రాలతో ప్రచారం, అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన చేపట్టాలి. డ్రాపౌట్స్‌ను గుర్తించి పాఠశాలల్లో, ప్రత్యేకావసరాలు గల పిల్లలను గుర్తించి సమీప భవిత కేంద్రాల్లో చేర్పించాలి. 11వ తేదీన 6నుంచి 10వరకు నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించాలి. 12న అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రజాప్రతినిధులతో ప్రారంభించాలి. అదేరోజు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాంలు అందించాలి. 13న ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామస్తులను ఆహ్వానించి వారి సమక్షంలో సామూహిక అక్షరాభ్యాసం, బాలసభ నిర్వహించాలి. 16న ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్), లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (లిప్) దినోత్సవాలను జరపాలి. అన్ని తరగతి గదుల్లో విషయాలవారీగా అభ్యసన సామర్థ్యాలకు సంబంధించిన పోస్టర్ ప్రదర్శించాలి. పిల్లలు రూపొందించిన వివిధ చార్టులతో తరగతి గదులను అలంకరించాలి. చదవడం, గణిత సంబంధిత అంశాలపై ఎఫ్ఎల్ఎన్ క్విజ్ పోటీలు నిర్వహించాలి. 17న సమీకృత విద్య, బాలిక విద్యాదినోత్సవం నిర్వహించి బాల్య వివాహాలు, చిన్నారులపై వేధింపులకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించాలి. 18న తల్లిదండ్రులు, గ్రామస్తులను ఆహ్వానించి తరగతి గదుల డిజిటలీకరణ, ఇతర ఆధునిక సౌకర్యాలు చూపించాలి. మొక్కల పెంపకం ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించాలి. 19న బడిబాట ముగింపు సందర్భంగా విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించాలి.

పకడ్బందీగా నిర్వహించాలి



జూన్ 6 నుంచి 19వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల్లో పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశాం. విద్యార్థులకు జూన్ 12న పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు అందించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించాం. – రామారావు, డీఈవో

ఘనంగా పీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

నిర్మల్‌చైన్‌గేట్: టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ జన్మదినాన్ని జిల్లా కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ ఎంబడి రాజేశ్వర్ ఆధ్వర్యంలో పట్టణంలోని నగరేశ్వరవాడ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంత రం డవ్ వృద్ధాశ్రమంలో అనాథలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. మహాలక్ష్మివాడలో నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ సేవాదల్ జిల్లా చైర్మన్ కందుల రాజేశ్వర్, కాంగ్రెస్ ఆదివాసీ జిల్లా చైర్మన్ బానావత్ గోవింద్‌నాయక్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రాకేశ్, నాయకుడు నాంపల్లి నర్సయ్య, ఎస్సీ సెల్ నాయకులు తలారి రాజేశ్వర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.


అనాథాశ్రమంలో బర్త్‌డే వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎక్స్‌రే సేవలు వినియోగించుకోవాలి

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి
- డిజిటల్ ఎక్స్‌రే మిషన్ ప్రారంభం
- కొనుగోలు కేంద్రం పరిశీలన


సార్సాపూర్ (జి): డిజిటల్ ఎక్స్‌రే మిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

సార్సాపూర్ (జి): డిజిటల్ ఎక్స్‌రే సేవలు సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని 30 పడకల సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం డిజిటల్ ఎక్స్‌రే మిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన వసతులు లేక ప్రమాదాల్లో గాయపడ్డ వారిని నిర్మల్, భైంసా ఏరియా ఆస్పత్రులకు తరలిస్తుండగా జాప్యం జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు. త్వరలో దీనిని 50పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన
మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి సందర్శించారు. అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. సెంటర్ నిర్వాహకులు 3కిలోల చొప్పున అదనంగా ధాన్యాన్ని తూకం వేస్తున్నారని రైతులు ఎమ్మెల్యేకు తెలిపారు. అధిక తూకం, రైస్ మిల్లుల్లో ధాన్యం కటింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఫోన్‌లో ఆదేశించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. డీఎంహెచ్‌వో రాజేందర్, డీసీహెచ్ఎస్ సురేశ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రమోద్ చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, దొడ్డికింది ముత్యంరెడ్డి, చంద్రకాంత్, నరేందర్, శ్రీకాంత్‌రెడ్డి, అర్జున్ ఠాకూర్, దత్తురాం, సుధాకర్, రాజేందర్, మహిపాల్, రాజు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ
సారంగాపూర్: మండలంలోని సిర్పెల్లి నుంచి బండ్రేవుతండా వరకు రూ.75లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి భూమిపూజ చేశారు. మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోగల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. సారంగపూర్‌లో గన్నీ సంచుల కొరత ఉందని తెలుసుకుని సివిల్ సప్లయ్ అధికారులతో మాట్లాడారు. ఆదివారం తప్పనిసరిగా సంచులు తెప్పిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. బీజేపీ మండలాధ్యక్షుడు నరేశ్, ఉపాధ్యక్షుడు తిరుమలాచారి, నాయకులు సాహెబ్‌రావు, వీరయ్య, చంద్రప్రకాశ్‌గౌడ్, గంగారెడ్డి, విలాస్ తదితరులున్నారు.

పాలిసెట్‌లో నిర్మల్ విద్యార్థినికి 9వ ర్యాంక్


సాయిసాత్వికకు మొక్క అందజేసి అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

నిర్మల్ రూరల్: పాలిసెట్‌లో నిర్మల్ విద్యార్థిని సత్తా చాటింది. శనివారం విడుదలైన ఫలితాల్లో జిల్లా కేంద్రానికి చెందిన సంతోష్‌కుమార్–కళ్యాణి దంపతుల కుమార్తె జి.సాయిసాత్విక రాష్ట్రస్థాయిలో తొమ్మిదో ర్యాంక్ కైవసం చేసుకుంది. 120 మార్కులకు గాను 118 మార్కులు సాధించింది. సాత్విక చిన్నప్పటి నుంచే చదువులో ముందుంటోంది. పదో తరగతి వరకు జిల్లా కేంద్రంలోని మేధా మోరల్ స్కూల్లో చదివింది. సాత్వికను పాఠశాల ప్రిన్సిపాల్ శారద, కరస్పాండెంట్ సిద్ధులు తదితరులు సన్మానించారు.

ఇంటర్ పరీక్షలకు 167 మంది గైర్హాజరు

నిర్మల్ రూరల్: జిల్లాలో శనివారం నిర్వహించిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 167 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో పరశురాం తెలిపారు. ఫస్టియర్‌లో 2,563 మందికి 2,438 హాజరు కాగా, 125 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ కేటగిరిలో 2,428 మందికి 2,309 మంది హాజరు కాగా 119 మంది పరీక్ష రాయలేదు. ఒకేషనల్ కోర్సులో 135 మందికి 129 మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. సెకండియర్‌లో 636మందికి 599 మంది హాజరు కాగా, 37 మంది పరీక్ష రాయలేదు. జనరల్ కేటగిరిలో 567మందికి 531మంది హాజరు కాగా 36మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 69 మందికి 68 మంది హాజరు కాగా ఒకరు పరీక్ష రాయలేదు.

శాశ్వత భవనం నిర్మించాలి


డీఎంఈకి వినతిపత్రం ఇస్తున్న ప్రిన్సిపాల్

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో నిర్మల్‌లో శాశ్వత భవన నిర్మాణం చేపట్టాలని కళాశాల ప్రిన్సిపాల్ ఓరుగంటి శ్రీనివాస్ డీఎంఈ నరేంద్రకుమార్‌ను కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యార్థులకు ప్రయాణ సౌకర్యం కోసం బస్సు వేయాలని, టీచింగ్ ఫ్యాకల్టీని నియమించాలని, కళాశాలలో మంటలు ఆర్పే పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి డీఎంఈ సానుకూలంగా స్పందించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రిన్సిపాల్ వెంట వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మనోజ్‌కుమార్ ఉన్నారు.

అటవీ అనుమతులపై సమీక్ష

నిర్మల్‌చైన్‌గేట్: ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల మౌలిక సదుపాయాల పనులకు అటవీశాఖ అనుమతుల జాప్యంపై శనివారం సచివాలయంలో అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ, నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్‌తో పాటు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, సీసీఎఫ్‌లు, డీఎఫ్‌వోలు, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు వెడ్మా బొజ్జు పటేల్, కోవ లక్ష్మి, పాల్వాయి హరీశ్, అనిల్ జాదవ్, ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ.. అటవీ అనుమతులు ఆలస్యమవడంతో అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతున్నట్లు చెప్పారు. అధికారుల నివేదికలు, ప్రజాప్రతినిధుల సూచనలు పరిగణనలోకి తీసుకున్న మంత్రులు, సమస్యను త్వరగా పరిష్కరించి అభివృద్ధి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ



కోటపల్లి: మండలంలోని రొయ్యపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ జరిగింది. శనివారం ఉదయం కేంద్రం తలుపులు పగులకొట్టి ఉండటంతో స్థానికులు నిర్వాహకురాలు విజయలక్ష్మికి సమాచారం అందించారు. ఆమె అక్కడికి వచ్చి చూడగా కేంద్రంలో 17 పాల ప్యాకెట్లు, 10 పప్పు ప్యాకెట్లు, 5 ట్రేల కోడిగుడ్లను గుర్తుతెలియని దుండుగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కాలేజీరోడ్‌లో..

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్‌లో ఈనెల 22న చోరీ జరిగినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కాలేజీరోడ్‌కు చెందిన ముక్తా ప్రసాద్ జైపూర్ మండలం ఇందారంలో రేషన్ షాపులో పనిచేసేవాడు. ప్రసాద్ ప్రతీ రోజు ఉదయం ఇందారం వెళ్లి సాయంత్రం వచ్చేవాడు. ఈనెల 21న ప్రసాద్ భార్య ఇంటికి తాళం వేసి బయటకు వెళ్తూ పక్కనే ఉన్న చందా ప్రసన్నలక్ష్మికి తాళం చెవి ఇచ్చింది. ఈనెల 22న ఉదయం ఇంట్లో బీరువాలో 120 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. సుమారు వీటి విలువ రూ.7.20 లక్షలు ఉంటుందన్నారు. ప్రసన్నలక్ష్మి, మరో వ్యక్తిపై అనుమానం ఉందని బాధితుడు ప్రసాద్ ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సైకిల్‌ను ఢీకొట్టిన ఆటో



రాజన్న (ఫైల్)

జన్నారం: సైకిల్‌ను ఆటో ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతిచెందాడు. జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై రాజవర్ధన్ కథనం ప్రకారం.. మండలంలోని అక్కపెల్లిగూడకు చెందిన గోలి రాజన్న (55) పాత ఇనుప సామాను దుకాణంలో పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి పని ముగించుకుని సైకిల్‌పై ఇంటికి వస్తున్నాడు. జన్నారం వైపు వస్తున్న ఆటో వెనుకవైపు నుంచి సైకిల్‌ను ఢీకొట్టడంతో రాజన్నకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని అతన్ని జన్నారంలో ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం లక్సెట్టిపేట ఆసుపత్రికి పంపించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన ఆటో బాదవత్ జనంత్‌రావుకు చెందినదిగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య కళావతి ఫిర్యాదుతో శనివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, ఒక కూతురు ఉండగా పెళ్లయింది.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

బెజ్జూర్: మండలంలోని కుశ్నపల్లి సమీపంలో శుక్రవారం సాయంత్రం గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పక్కా సమాచారంతో వాహనాలు తనిఖీ చేపట్టినట్లు పేర్కొన్నారు. సులుగుపల్లికి చెందిన మాజీ ఉప సర్పంచ్ సిడాం సంతోష్ బైక్‌పై తరలిస్తున్న రూ.3,86,970 విలువ చేసే 3.47 కిలో గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

సాహిత్యంలో 'అరుణ' కిరణం!

- ఆకట్టుకుంటున్న బట్టువార్ బాల సాహిత్యం..
- విద్యార్థుల్లో సాహిత్య బీజాలు నాటుతున్న ఉపాధ్యాయురాలు..
- తాను రచిస్తూ.. పిల్లల్లో సాహిత్యం పెంపొందించేలా ప్రేరణ..
- ఐదు భాషల్లో మధుర గేయాల పుస్తకాలు ముద్రణ
- సొంతంగా 1,937 కవితలు రాసిన టీచర్..
- నేడు 'తెలంగాణ సారస్వత పరిషత్' ఆధ్వర్యంలో సన్మానం



తెలుగులో గేయం రాసిన మన్నూర్ పాఠశాల విద్యార్థులు(ఫైల్)



ముద్రించిన బాలగేయాల పుస్తకాలతో అరుణ

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా భీంసరికి చెందిన ఉపాధ్యాయురాలు అరుణ బట్టువార్ ప్రాథమిక స్థాయి విద్యార్థులను బాల కవులు, సాహిత్యవేత్తలుగా తీర్చిదిద్దేందుకు విశేష కృషి చేస్తున్నారు. ప్రస్తుతం ఇంద్రవెల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న ఆమె.. బాలల్లో సాహిత్య ఆసక్తిని పెంపొందిస్తున్నారు. ఆమె స్వయంగా 1,937 కవితలు రాసి, 10 సాహిత్య పుస్తకాలను ప్రచురించారు. విద్యార్థుల ద్వారా ఐదు భాషల్లో ఆరు బాల గేయ పుస్తకాలను ముద్రించారు. ఆమె సేవలను గుర్తించి, 'తెలంగాణ సారస్వత పరిషత్' 82వ స్థాపన దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో ఆదివారం జరిగే బాల సాహిత్య సమ్మేళనంలో సన్మానించనుంది.

సాహిత్య సేవలకు గుర్తింపు

అరుణ బట్టువార్ 1997లో ఎంఏ, బీఎడ్ పూర్తి చేసి ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. కథలు, నాటికలు రాసి రేడియో ప్రోగ్రామ్‌ల ద్వారా ప్రసారం చేశారు. ఆమెకు విశ్వవిఖ్యాత గౌతమి నంది, ఎస్వీఆర్ డిజిటల్ అండ్ గౌతమేశ్వర కామధేను, ప్రైడ్ ఇండియా, కలం భూషణ్, సాహితీ కిరణం, గుడిహత్నూర్ బెస్ట్ టీచర్, సావిత్రిబాయి పూలే, చతుర్ముఖ సింహ, కథరత్న, మధుర కవయిత్రి వంటి అనేక అవార్డులు లభించాయి. తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, విశ్వవిఖ్యాత కీర్తి, తెలుగు వెలుగు జాతీయ సాహిత్య పురస్కారాలు, ఆర్‌ఎస్‌ఎన్ సేవ ఫౌండేషన్ కవితా పురస్కారాలు కూడా ఆమె సొంతం చేసుకున్నారు.

ఐదు భాషల్లో బాల గేయాలు

అరుణ బట్టువార్ పనిచేసిన పాఠశాలల్లో విద్యార్థులతో కవితలు, సాహిత్య రచనలు చేయించారు. 2021–24 మధ్య గుడిహత్నూర్ మండలం మన్నూర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ, విద్యార్థులతో తెలుగు, హిందీ, మరాఠీ, ఇంగ్లిష్ భాషల్లో గేయాలు రాయించారు. వాటిని 'మన్నూర్ బాలల మధుర గేయాలు', 'మన్నూర్ చిల్డ్రన్స్ మెలోడీయస్ రైమ్స్' వంటి పుస్తకాలను ముద్రించారు. 2013లో సీతారాంగూడ పాఠశాలలో గోండి భాషలో 'చుదూర్ కాండీరా... చుదూర్ పాటింగ్' గేయాల పుస్తకాన్ని రాయించారు. ఇంద్రవెల్లిలో గత విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులతో అలంకార కవితలు రాయించి పుస్తకం ముద్రించారు.

సాహిత్య బీజం నాటి..

అరుణ బట్టువార్ సాహిత్య ప్రతిభను విద్యార్థుల్లో నాటడం ద్వారా బాల సాహిత్యానికి కొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. ఆమె కృషిని జిల్లా వాసులు, తోటి ఉపాధ్యాయులు ప్రశంసిస్తున్నారు. ఆమె బోధన, సాహిత్య రచనలు భావి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి.

సంతోషించారు



గోండి భాషకు లిపి లేదు. మాతో గోండి భాషలో బాలగేయాలు రాయించాలని టీచర్ కృషి చేశారు. తెలుగులో చెబుతుంటే మేము గోండి భాషలో రాశాం. మా తప్పులు సరిచేస్తూ మళ్లీ రాయిస్తూ చక్కటి బాలగేయ పుస్తకాలను టీచర్‌తో కలిసి సమాజానికి అందించాం. మేం రాసిన పుస్తకం చదివి మా గ్రామస్తులు సంతోషించారు

– కినక గణేశ్, సీతారాంగూడ విద్యార్థి

బాల కవులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

పిల్లల్లో సాహిత్యాన్ని పెంపొందిస్తాం. చక్కని కథలు, గేయాలు, వచన కవితలు రాసేటట్టు తర్ఫీదునిస్తాం. పిల్లలను బాల కవులుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యం. సాహితీ పుస్తకాలు చదవడం, రాయడంతో నైపుణ్యం పెరుగుతుంది. – అరుణ బట్టువార్, ఇంద్రవెల్లి జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయురాలు

టీచర్ కృషితోనే..



తెలుగులో అలంకారాలు నేర్చుకోవడంలో టీచర్ సులువు పద్ధతి చెప్పేవారు. ఉదాహరణలు ఇస్తూ వాటి ద్వారా కవితలు రాయిస్తే గుర్తుంటాయని మాతో కవితలు రాయించేది. మొదట్లో కొంత తికమకపడ్డాం. మేడం సలహాలతో 20 మంది పదో తరగతి విద్యార్థులు వివిధ అలంకార కవితలు రాశాం. ఇలా రాయడంలో టీచర్ కృషి ఉంది.

– చంద్రకాంత్, మన్నూర్ పాఠశాల విద్యార్థి

పట్టు సాధించాం



టీచర్‌తోనే సాహిత్యం, బాలగేయం పరిచయమైంది. ఆమె ప్రోత్సాహంతో బాలగేయాలు రాసేవాళ్లం. అందులో తప్పులు సరిచేస్తూ మళ్లీ రాయించేది. ఇలా రాయడం ద్వారా సాహిత్యం, బాల గేయాలపై పట్టు సాధించగలిగాం. ఆంగ్ల బాలగేయ పుస్తకాన్ని ముద్రించగలిగాం. టీచర్ కృషితో ఇది సాధ్యమైంది.

– పెందోర్ లక్ష్మి, మన్నూర్ విద్యార్థిని

ఎస్టీపీపీలో వర్క్స్ కమిటీ సమావేశం నిర్వహించాలి



రియాజ్ అహ్మద్

జైపూర్: ఎస్టీపీపీలో వర్క్స్ కమిటీ సమావేశం నిర్వహించాలని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2016–20 వరకు స్టీగ్ కంపెనీ నుంచి కార్మికులకు ఫుల్‌అండ్ ఫైనల్ సెటిల్మెంట్ ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. ఒక్కో కార్మికుడికి రూ.70వేలకు పైగా వస్తాయని, ఆ డబ్బులు సింగరేణి యాజమాన్యం కాజేసిందా అని ప్రశ్నించారు. పవర్‌మేక్ కంపెనీ సబ్ కాంట్రాక్టు వీవీఆర్ అనే కంపెనీ 2016–23 వరకు కార్మికులకు ఫుల్‌అండ్ ఫైనల్ సెటిల్మెంట్ చేయలేదన్నారు. కంపెనీ నిబంధనలు ప్రకారం బోనస్ 8.33 ఇవ్వాలని అలా చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. పవర్‌మేక్ కంపెనీ వెంటనే డబ్బులు చెల్లించాలని లేకపోతే కార్మికులు ఆందోళన చేపడుతారని హెచ్చరించారు.

పులిని హతమార్చిన 30 మంది అరెస్టు

కాగజ్‌నగర్‌టౌన్: పెంచికల్‌పేట మండలంలోని ఎల్లూరు అటవీప్రాంతంలో విద్యుత్ తీగల ఉచ్చుతో పులిని హతమార్చిన 30 మందిని శనివారం అరెస్టు చేసినట్లు కాగజ్‌నగర్ ఫారెస్టు డివిజన్ అధికారి సుశాంత్ సుఖ్‌దేవ్ బోబాడే తెలిపారు. అప్పాజి శ్రీనివాస్, వెంకటేశ్,ఎల్కరి శేఖర్, రోహిని శ్రావణ్, చప్పిడె అశోక్, పవన్‌కుమార్,ఎల్కరి ప్రకాశ్, వెంకటేశ్, కాటెల సాగర్, నికాడి వెంకటేశ్, లా త్కరి శ్రీనివాస్, భీంకరి వెంకటేశ్, భీంకరి రంగయ్య, లేగల గోపాల్, రాచకొండ లచ్చయ్య, ఓంద్రె సంతోశ్, తుమ్మిడె శ్రీనివాస్, ఎల్కరి సుగుణాకర్, బుర్రి తిరుపతి, ఓంద్రె నారాయణ, లేగల వెంకటేశ్, గోమాసు రాజన్న, మడె మధునయ్య, లేగల సత్యనారాయణ, ఎల్లూరి లచ్చన్న, మౌల్కార్ దివాకర్, బిన్కర్ తిరుపతి, తుమిడె సత్తయ్య, పెద్దల నీలయ్య, గావుడె శంకర్ ఉన్నారన్నారు. సిర్పూర్(టి) సివిల్‌కోర్టులో హాజరుపర్చామని, 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించగా, ఆసిఫాబాద్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

బాక్సింగ్ చాంపియన్లుగా నిలవాలి



బాక్సింగ్ పోటీల్లో గెలుపొందిన వారిని ప్రకటిస్తున్న నిర్వాహకులు



మాట్లాడుతున్న డీవైఎస్‌వో కీర్తి రాజ్‌వీర్

మంచిర్యాలటౌన్: బాక్సింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులు చాంపియన్లుగా నిలిచి, జాతీయస్థాయిలోనూ రాణించాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కీర్తిరాజ్‌వీర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ పర్యవేక్షణలో టైసన్ కప్–2025 చాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలను శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఈనెల 26వ తేదీ వరకు నిర్వహించనున్న బాక్సింగ్ పోటీలకు రాష్ట్రస్థాయి నుంచి 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ పురుషోత్తం నాయక్, నిర్వాహకుడు చిలువేరు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పశువులు మృతి



లక్ష్మణచాంద: గేదె కళేబరం



దిలావర్‌పూర్:ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎద్దు కళేబరం

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లితండాలో విద్యుత్ షాక్‌తో గేదె మృతిచెందింది. గేదె ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం మేతకు వెళ్లి ంది. తిరిగి సాయంత్రం ఇంటికి రాకపోవడంతో రైతు బానావత్ రాంజీ చుట్టూపక్కల వెతి కాడు. శనివారం అటు వైపుగా వెళ్లిన గ్రామస్తులకు గేదె మృతి చెంది కనిపించడంతో రైతుకు సమాచారమిచ్చారు. మేత మేసేక్రమంలో వి ద్యుత్ షాక్ తగలి మృతి చెందినట్లు గుర్తించా రు. దీని విలువ రూ.55 వేలు ఉంటుందని ప్ర భుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

దిలావర్‌పూర్‌లో..

దిలావర్‌పూర్: మండల కేంద్రానికి చెందిన రైతు నంద ముత్యం ఎద్దు శనివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ఎప్పటిలాగే తన పంటచేలకు ఎడ్లబండితో వెళ్లి అక్కడ వ్యవసాయ పనులు చేస్తున్నాడు. మేతకోసం ఎద్దులను పొలంలో ఉంచగా ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. అక్కడ 11 కేవీ విద్యుత్ తీగలకు ఎద్దు తోక తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు కిందపడిపోగానే అక్కడకు చేరుకున్న రైతు ఏం జరిగిందో తెలియక వేలాడుతున్న విద్యుత్ తీగను చూసి భయాందోళనకు గురయ్యాడు. వెంటనే విద్యుత్ సరఫరా నిలుపుదల చేయాలని అధికారులకు సమాచారమిచ్చారు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.80 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.



కడెం: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆవు..

కడెంలో..

కడెం: మండలంలోని అల్లంపల్లి జీపీ పరిధి పాలరేగడి గ్రామ గిరిజన రైతు పెంద్రం మధుకు చెందిన ఆవు విద్యుత్ షాక్‌తో మృతిచెందింది. దత్తోజిపేట సమీపంలో శుక్రవారం ఆవు మేతకు వెళ్లి సాయంత్రం ఇంటికి వస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగలకు తగిలి షాక్‌తో మృతిచెందింది. దీని విలువ రూ.40 వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

20 క్వింటాళ్ల నకిలీ పత్తివిత్తనాలు పట్టివేత




స్వాధీనం చేసుకున్న నకిలీ పత్తి విత్తనాలు

కాగజ్‌నగర్‌రూరల్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.60 లక్షల విలువైన 20 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. కాగజ్‌నగర్ రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఎస్పీ డీవీ.శ్రీనివాస్‌రావు శనివారం వివరాలు వెల్లడించారు. నకిలీ విత్తనాలు సరఫరా అవుతున్నాయని టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందడంతో కాగజ్‌నగర్ సమీపంలోని పెద్దవాగు సమీపంలో తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో అటుగా వచ్చిన ఏపీ39 టీవై 9741 నంబర్ ఐచర్ వ్యాన్‌ను తనిఖీ చేయగా అందులో 20 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు ఉన్నట్లు గుర్తించారు. విత్తనాలకు సంబంధించిన వివరాలు తెలుపకపోవడంతో కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడకు చెందిన కొత్తపల్లి సదాశివ్, కర్నూల్ జిల్లా అదోనికి చెందిన డ్రైవర్ పుప్పాల లక్ష్మణ్, మహారాష్ట్రలోని అహేరికి చెందిన సంతోష్‌కిశోర్‌ను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. మరో నిందితుడు వేణుగోపాల్‌రెడ్డి పరారీలో ఉన్నారని తెలిపారు. జిల్లాలో ఎవరైనా నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, కాగజ్‌నగర్‌రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు, టాస్క్‌ఫోర్స్ ఎస్సై వెంకటేశ్, రూరల్ ఎస్సై సందీప్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని కోకస్‌మన్నూర్, ఇస్లాంనగర్ గ్రామాల్లో ఆదిలాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆధ్వర్యంలో శనివారం నకిలీ విత్తనాలు పట్టుకున్నట్లు తెలిసింది. ఉదయం 8 గంటలకు ఏకకాలంలో దాడులు నిర్వహించి నకిలీ బీజీ–3 విత్తనాలను పట్టుకున్నట్లు సమాచారం. ఈ దాడుల్లో 18 నకిలీ విత్తనాల బ్యాగులతో పాటు ముగ్గురిని అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై స్థానిక ఎస్సై పురుషోత్తం వివరణ కోరగా ఆకస్మికంగా దాడులు జరిపిన మాట వాస్తవమన్నారు. విచారణ కొనసాగుతుందని పేర్కొన్నారు.

కార్మికులకు అండగా ఉండాలి



నియామక పత్రాలు అందజేస్తున్న జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్: కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉండాలని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్ తెలిపారు. శుక్రవారం రాత్రి రసూల్‌పల్లెలోని తన నివాసంలో శ్రీరాంపూర్ డివిజన్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఏ సమస్య వచ్చినా యజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. కార్మికుల చిరకాల వాంఛ అయిన సొంతింటి పథకం అమలు కోసం కృషి చేస్తున్నామన్నారు. అలవెన్స్‌లపై ఆదాయ పన్ను రీయింబర్స్‌మెంట్, రూ.25 లక్షల వడ్డీ లేని రుణం తదితర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎన్నికల వేళ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులకు యూనియన్ పదవులు అప్పగించి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర కమిటీ నాయకులు భీంరావు గరిగే స్వామి, కలవేన శ్యామ్, ఏనుగు రవీందర్‌రెడ్డి, జీవన్‌జోయల్, తిరుపతిరాజు, నాయకులు పేరం రమేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


నడుమునొప్పి భరించలేక ఆత్మహత్య



గరికే లక్ష్మణ్ మృతదేహం

తానూరు: నడుమునొప్పి భరించలేక యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై భానుప్రసాద్ కథనం ప్రకారం.. మండలంలోని వడ్ఝురి(బి) గ్రామానికి చెందిన గరికే లక్ష్మణ్ (29) రెండేళ్లుగా నడుమునొప్పితో బాధపడుతున్నాడు. గతేడాది శస్త్రచికిత్స చేయించుకున్నా నయం కాలేదు. ఆ తర్వాత వ్యవసాయ పనులు చేస్తుండగా కట్ల పాము కాటేసింది. కాళ్లవాపు తగ్గలేదు. వైద్య పరీక్షలు నిర్వహించుకోగా వ్యాధి నయం కాలేదు. అటు నడుమునొప్పి, ఇటు కాళ్లవాపు తగ్గకపోవడం తీవ్ర మనస్తాపంతో శుక్రవారం సాయంత్రం వ్యవసాయ పొలానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. రాత్రయినా లక్ష్మణ్ ఇంటికి తిరిగి రాకపోవడంతో తండ్రి బాలాజీ వెతుకుంటూ వ్యవసాయ పొలానికి వెళ్లాడు. అక్కడ స్పృహ కోల్పోయిన లక్ష్మణ్‌ను భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. భార్య నాగమణి ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

పాముకాటుకు మధ్యప్రదేశ్‌వాసి మృతి



విష్ణుప్రసాద్ మృతదేహం

తాండూర్: పాము కాటుకు మధ్యప్రదేశ్ వాసి మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వర్కడే విష్ణుప్రసాద్ (52) బతుకుదెరువు కోసం తాండూర్ మండలం రేపల్లెవాడకు వలసవచ్చాడు. ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులో కూలీ పనులు చేస్తూ రేపల్లెవాడలో అద్దెకు ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రించిన విష్ణుప్రసాద్ శనివారం తెల్లారేసరికి పాముకాటుకు గురై మృతి చెంది ఉన్నాడు. స్థానికులు ఈ విషయాన్ని పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడి సోదరుడు మాన్‌సింగ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుళ్లిన చికెన్, పాడైన గుడ్లు



అన్నంలో వచ్చిన బొద్దింక



కుళ్లిన చికెన్

- దాబాలో నాసిరకం ఆహార పదార్థాలు
- తాజాగా అన్నంలో బొద్దింక ప్రత్యక్షం

బోథ్: సొనాల మండలంలోని ఓ పెట్రోల్ పంపు సమీపంలో గల దాబాలో కుళ్లిన చికెన్, పాడైన గుడ్లు దర్శనమిచ్చాయి. అంతేకాదు దాబాలో తింటున్న ఓ యువకుడి అన్నంలో బొద్దింక వచ్చింది. బోథ్ మండలంలోని కౌఠ(బి) గ్రామానికి చెందిన యువకుడు శనివారం సొనాల మండలం గుట్టపక్క తండా సమీపంలో ఓ పెట్రోల్ పంపు వద్ద ఉన్న దాబాకు వెళ్లాడు. భోజనం చేస్తుండగా అన్నంలో బొద్దింక ప్రత్యక్షంతో కంగుతిన్నాడు. వెంటనే దాబా సిబ్బందిని పిలిచి ఇదేంటని అడిగితే, అనుకోకుండా వచ్చిందని నిర్లక్ష్యంగా సమాధానమివ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేశాడు. యువకుడు పలువురు స్థానికులు, విలేకరులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని తనిఖీ చేయగా బొద్దింక ఉన్న అన్నంతోపాటు, రిఫ్రిజిరేటర్‌లో కుళ్లిన చికెన్ మాంసంతోపాటు పాడైన ఉడకబెట్టిన గుడ్లు కనిపించాయి. అప్పటికే దాబాలో తింటున్న వారు అవాక్కయ్యారు. మధ్యలో భోజనం ఆపివేశారు. భోజనంలో బొద్దింక రావడంపై సదరు సిబ్బందిని అడుగగా నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చారని వారు తెలిపారు. అధికారులు వెంటనే దాబాను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

తాత్కాలికంగా సింగరేణి ప్యాసింజర్ రైలు రద్దు

బెల్లంపల్లి: భద్రాచలం రోడ్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య రాకపోకలు సాగించే సింగరేణి ప్యాసింజర్ రైలు (నెం.17033/17034)ను తాత్కాలికంగా రద్దు చేశారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో నాన్ ఇంటర్ లాకింగ్, రైల్వేట్రాక్ పునరుద్ధరణ పనులు జరుగుతుండటంతో రైలును రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఈమార్గంలో ఎక్క డ నాన్ ఇంటర్ లాకింగ్, రైల్వేట్రాక్ పనులు చేపట్టినా సింగరేణి ప్యాసింజర్ రైలును తాత్కాలికంగా కొన్నిరోజుల పాటు రద్దు చేయడం రైల్వే అధికారులకు పరిపాటిగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. ఈకారణంగా భద్రాద్రి కొత్తగూడెం వెళ్లడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డా యి. ముఖ్యంగా కోల్‌బెల్ట్‌ప్రాంతాల వాసులకు సింగరేణి పరంగా కొత్తగూడెం వెళ్తుంటారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సత్వరంగా సింగరేణి ప్యాసింజర్ రైలును పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.